
హోమమండపంలో ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు


స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

# కొండంతా కాషాయమయం

- హనుమాన్ దీక్షాపరులతో కిక్కిరిసిన కొండగట్టు
- మాలవిరమణ చేసిన భక్తులు
- నేడు హనుమాన్ పెద్ద జయంతి

మల్యాల, మే 31: నలు దిక్కుల దారులన్నీ కొండగట్టు వైపునకు మర్లాయి. అంజన్న క్షేత్రంలో శనివారం నిర్వహించే హనుమాన్ పెద్ద జయంతికి కాషాయధారులు, భక్తులు పోటెత్తారు. దీక్షాపరులు అంజన్న సన్నిధిలో మాల విరమణ చేసి ఇరుముడి స్వామి వారికి సమర్పించారు. అనంతరం తలనీలాలు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు.


భక్తులతో నిండిపోయిన ఆలయ ఆవరణ

**త్రికుండాత్మక యజ్ఞం**

హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారి మూల విరాట్టుకు ప్రత్యేకాభిషేకంతో పాటు వేంకటేశ్వర స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం యాగశాలలో స్థాపిత దేవతారాధన, హోమం, సుందరకాండ పారాయణం చేసి ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అభిషేకం, సహస్రనామార్చన, మహానివేదన, మంత్రపుష్పం సమర్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. త్రైయాహ్నిక త్రికుండాత్మక (మూడు యజ్ఞ గుండాలతో ఆంజనేయ స్వామి, వేంకటేశ్వర స్వామి, అమ్మ వార్లకు) హోమాన్ని వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఈవో ఆకునూరి చంద్రశేఖర్, హనుమాన్ జయంత్యుత్సవాల ప్రత్యేకాధికారి వినోద్ రెడ్డి, ఏఈవో వైరాగ్యం అంజయ్య, ఏఈ లక్ష్మణ్‌రావు సిబ్బందితో కలిసి భక్తులకు ఏర్పాట్లు చేశారు.

**భక్తులకు ఉచిత వైద్య సేవలు**

పోలీస్ ఔట్ పోస్టు, వై జంక్షన్, ఆలయం పక్కన, బొజ్జ పోతన వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి భక్తులకు నిరంతరం వైద్య సేవలందిస్తున్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందజేస్తున్నారు. జగిత్యాల డీఎస్పీ దురిశెట్టి రఘుచందర్, మల్యాల సీఐ నీలం రవి, మల్యాల, కొడిమ్యాల ఎస్ఐలు అబ్దుల్ రహీం, కుమారస్వామి, సందీప్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఘాట్ రోడ్డు గుండా వాహనాల రాకపోకలను నిషేధించి దొంగలమర్రి, జేఎన్‌టీయూ మీదుగా బొజ్జ పోతన వరకు వాహనాలను మళ్లించారు. పార్కింగ్ స్థలాల నుంచి వై జంక్షన్ వరకు దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు.


ఆలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

**సామాజిక సేవా కార్యక్రమాలు**

కొండపై గల వై జంక్షన్ వద్ద కరీంనగర్‌కు చెందిన ప్రకాశం గంజ్ ఫ్రెండ్స్ నేతృత్వంలోని వరసిద్ధి వినాయక సేవాసమితి ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత అన్న ప్రసాదం పంపిణీ చేశారు. రామన్నపేటకు చెందిన ప్రవీణ్ స్వామి వారి అలంకరణకు 2001 అరటిపండ్లు అందజేశారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

కొండపై ఆలయ పర్యవేక్షకుడు శ్రీనివాస శర్మ నేతృత్వంలో కళాబృందాలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి హరికథ భాగవతం, భక్తి సంగీతం, రామలీల గానం, సతీసావిత్రి నాటకం, శ్రీ రామాంజనేయ యుద్ధం తదితర కార్యక్రమాలను ప్రదర్శించారు.

**అంజన్నను దర్శించుకున్న విప్**

కొండగట్టు అంజన్నను విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేయడంతో పాటూ ఆశీర్వచనం చేశారు.

# అన్నదాతలు ఆందోళన చెందవద్దు

- అందుబాటులో విత్తనాలు
- కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా


దుకాణాదారుడిని స్టాక్ నిల్వల గురించి అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల, మే 31: అన్నదాతలు ఆందోళన చెందవద్దని, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తెలిపారు. జిల్లా కేంద్రంలోని జగిత్యాల రైతు డిపో ఆగ్రో ఏజెన్సీస్‌లో శుక్రవారం ఆమె వ్యవసాయాధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వానకాలం పంటల ప్రణాళికకు అనుగుణంగా విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జిల్లాకు కేటాయించిన 14 వేల 300 క్వింటాళ్ల జీలుగ, 2460 క్వింటాళ్ల జనుము విత్తనాలను రైతులకు సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. ఇంకా అదనంగా 5 వేల క్వింటాళ్ల జీలుగ విత్తనాల కోసం ప్రభుత్వానికి విన్నవించినట్లు తెలిపారు. 16,988 మెట్రిక్ టన్నుల యూరియా, 7177 మెట్రిక్ టన్నుల కాంప్లెక్సలు, 1710 మెట్రిక్ టన్నుల డీఏపీ నిల్వలు ఉన్నట్లు వెల్లడించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు రసీదు తీసుకోవాలని, విత్తనాల కవరు సీజన్ అయిపోయే వరకు భద్రపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వాణి, అర్బన్ తహసీల్దార్ వరందన్, ఎస్ఐ మన్మదరావు, తదితరులు పాల్గొన్నారు.

**9న గ్రూప్-1 ప్రిలిమినరీ**

జూన్ 9న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రూప్-1 ప్రిలిమినరీ నిర్వహించనున్నట్లు కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకే గేట్ మూసివేస్తారని తెలిపారు. జూన్ ఒకటిన మధ్యాహ్నం 2 గంటల నుంచి వెబ్‌సైట్ https:// www. tgpsc.gov.in నుంచి హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

**అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన**

మల్యాల, మే 31: మండలంలోని రాజారాం శివారులో గల ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పథకం కింద చేపట్టిన పనులను శుక్రవారం కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీపీవో దేవరాజ్, హౌసింగ్ డీఈఈ రాజేశ్వర్, పీఆర్ ఈఈ రహమాన్, ఎంపీడీవో స్వాతి, ఏఈఈ ఇబ్రహీం మునావర్, ఎంఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బీడీ టేకేదారులకు కమీషన్ పెంపు

కోరుట్ల, మే 31: బీడీ పరిశ్రమల్లో పనిచేస్తున్న టేకేదారులకు కమీషన్ పెంచినట్లు ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి సుతారి రాములు తెలిపారు. నిజామాబాద్‌లో బీడీ పరిశ్రమల యజమానుల అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం బీడీ కార్మిక సంఘం నాయకులతో సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. వెయ్యి బీడీలకుగానూ బీడీ టేకేదారులకు కమీషన్ రేటు గతంలో 18 రూపాయల 10 పైసలు ఉండగా, ప్రస్తుతం 4 రూపాయల 50 పైసలు పెరిగిందన్నారు. సమావేశంలో బీడీ కార్మిక సంఘం నాయకులు ముక్రం, భానుచందర్, టేకేదారులు వెంకన్న, మల్లారెడ్డి, బీఎంఎస్, సీఐటీయూ, బీఎల్‌టీయూ, ఐఎఫ్‌టీయూ, హెచ్ఎంఎస్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సారు కారు ఇలా.. కార్యాలయానికి వచ్చిపోయేదెలా?


తహసీల్ కార్యాలయం ముఖద్వారం ఎదుట నిలిపిన కారు

మెట్‌పల్లి తహసీల్ కార్యాలయ ప్రధాన ముఖద్వారం ఎదుట కార్యాలయ ఓ అధికారి తన కారును నిలిపి ఉంచుతున్నారు. కారుపై ఎండవేడిమి పడకుండా పచ్చటి పరద (గ్రీన్ నెట్)ను ఏర్పాటు చేయించారు. అసలే ఇరుకు, ఆపై కార్యాలయ ముఖద్వారం వద్దే కారు నిలిపి ఉంచడంతో వచ్చిపోయే దివ్యాంగులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయ ఆవరణలో వాహనాల పార్కింగ్‌కు స్థలం ఉన్నా ఆ అధికారి మాత్రం కార్యాలయ ముఖద్వారం ఎదుట కారు నిలిపి ఉంచుతున్నారు. -మెట్‌పల్లి, మే 31

## హనుమాన్ పెద్ద జయంతికి భారీగా ఏర్పాట్లు


కొండగట్టులో అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

- కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా
- కొండగట్టులో అధికారులతో కలిసి పరిశీలన

మల్యాల, మే 31: కొండగట్టులో హనుమాన్ పెద్ద జయంతికి దేవాదాయ, ఇతర శాఖల అధికారులు భారీగా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తెలిపారు. కొండగట్టు ఆలయ పరిసరాల్లో ఏర్పాట్లను శుక్రవారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏర్పాట్లపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో పులి మధుసూదన్, ఆలయ ఈవో చంద్రశేఖర్, జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, ఉత్సవాల ప్రత్యేకాధికారి వినోద్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


మల్లాపూర్: ముత్యంపేటలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఏడీఏ

కోరుట్ల రూరల్/మల్లాపూర్/మల్యాల (కొడిమ్యాల), మే 31: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కిషన్ హెచ్చరించారు. పట్టణంలోని పలు విత్తనాలు, ఎరువుల దుకాణాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ బోర్డులు, గోదాములను పరిశీలించారు. రైతులకు విత్తనాలు విక్రయించేటప్పుడు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని డీలర్లకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవో నరేశ్, తదితరులు పాల్గొన్నారు. కొడిమ్యాల మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. విత్తనాలు, ఎరువుల బస్తాలు, రసీదు బుక్కులు, స్టాక్ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమణి, ఏవో జ్యోతి, ఏఎస్ఐ రాజయ్య పాల్గొన్నారు. మల్లాపూర్ మండలం ముత్యంపేటలోని పీఏసీఎస్ గోదాంలో యూరియా నిల్వలను తహసీల్దార్ వీర్‌సింగ్, ఇన్‌చార్జి ఏడీఏ లావణ్య, ఏఎస్ఐ లచ్చయ్య పరిశీలించారు.

## నర్సన్న సన్నిధిలో రాష్ట్ర చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ పూజలు

ధర్మపురి, మే 31: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి వారిని శుక్రవారం రాష్ట్ర చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ విద్యాసాగర్ రెడ్డి దర్శించుకొని, పూజలు చేశారు. కుటుంబసమేతంగా ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థానం సిబ్బంది ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆశీర్వచన మండపంలో దేవస్థానం ఈవో శ్రీనివాస్ స్వామి వారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదం అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వేదపండితుడు రమేశ్‌శర్మ, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, అర్చకుడు నరసింహమూర్తి, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.


చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్‌కు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈవో శ్రీనివాస్, తదితరులు

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327724-AII

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

## ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

ధర్మపురి, మే 31: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. శనివారం హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా దీక్షాపరులు గోదావరి నదిలో స్నానాలాచరించి స్వామి వారిని దర్శించుకొని పాదయాత్రగా కొండగట్టుకు బయలుదేరారు. దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్ పర్యవేక్షణలో భక్తుల సౌకర్యార్థం ఆలయం ముందు, గోదావరి నదిలో చలువ పందిళ్లు, టెంట్లు వేశారు. ఆలయంలోని ప్రసాదం కౌంటర్ ముందు, యమధర్మరాజు ఆలయం వద్ద, గోదావరి తీరం వద్ద మినరల్ వాటర్ ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

## అధ్యాపకుల ప్రచారం


విద్యార్థినితో మాట్లాడుతున్న అధ్యాపకులు

సారంగాపూర్, మే 31: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ అధ్యాపకులు శుక్రవారం పలు గ్రామాల్లో పదో తరగతి పూర్తయిన వారి వద్దకు వెళ్లి కళాశాల ప్రత్యేకతలను వివరిస్తూ పేర్లు నమోదు చేసుకున్నారు. కళాశాలలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజేందర్, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, సతీశ్, రాజు, సుజాత, సౌజన్య, నాగేశ్వరి, రజిత, తదితరులు పాల్గొన్నారు.

## సాయిరామ ఆలయంలో దేవాదాయ శాఖ సంయుక్త కమిషనర్ పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న దేవాదాయ శాఖ సంయుక్త కమిషనర్

కోరుట్ల, మే 31: పట్టణంలోని సాయిరామ ఆలయంలో శుక్రవారం దేవాదాయ, ధర్మదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ రామకృష్ణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కమిషనర్‌ను స్వామి వారి శేష వస్త్రాలతో సత్కరించి, ఆశీర్వచనాలు, ప్రసాదం అందజేశారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యనిర్వహణాధికారి కాంతారెడ్డి, ఆలయ సిబ్బంది ఉన్నారు.

## ఆవిర్భావ వేడుకలకు జాబితాపూర్ వాసి ఎంపిక

జగిత్యాల రూరల్, మే 31: తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు మండలంలోని జాబితాపూర్‌కు చెందిన మహిళా సంఘం సభ్యురాలు భారతపు శ్యామల హోంఫుడ్ యూనిట్‌కు ఎంపికైనట్లు శుక్రవారం ఐకేపీ అధికారులు పేర్కొన్నారు. శ్యామలకు డీపీఎం వెంకటేశం, ఏపీఎం గంగాధర్, సీసీలు, వీవోఏలు అభినందనలు తెలిపారు.

## ఫేస్‌బుక్ మిత్రుల ఔదార్యం


బాబుకుమార్ కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్

ధర్మపురి, మే 31: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమైన బాధితుడికి ఫేస్‌బుక్ మిత్రులు ఔదార్యం చూపి అండగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామానికి చెందిన అక్కనపల్లి బాబుకుమార్ నాలుగు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో ఎడమ కాలు కోల్పోయాడు. కాగా, నెలనెల మందులు, కుటుంబపోషణ, పిల్లల చదువుకు బాబుకుమార్ కుటుంబం ఇబ్బందులు పడుతున్నది. విషయం తెలుసుకున్న ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ స్పందించి బాబుకుమార్ పరిస్థితికి అక్షర రూపం ఇచ్చి మిత్రులు ఆదుకోవల్సిందిగా కోరుతూ బ్యాంకు ఖాతా వివరాలతో మే 4న ఫేస్‌బుక్‌లో పోస్టు చేశాడు. ఈ పోస్టుకు స్పందించిన తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు రూ.1.40 లక్షలు బ్యాంక్ ఖాతాలో జమచేశారు. ఇందులో రూ.50వేలు బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి, మిగతా డబ్బులను వైద్యఖర్చులకు గానూ ఎస్‌బీఐ మేనేజర్ సంతోష్ చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. ఫేస్‌బుక్ మిత్రులకు బాబుకుమార్ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ


రైతుకు పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్న డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి, మే 31: ధర్మపురి సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు పచ్చిరొట్ట వత్తనాలను డీసీఎమ్మెస్ చైర్మన్ డా. ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు పట్టా పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ వెంట తీసుకొని వచ్చి సహకార సంఘ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సహకార సంఘం ఉపాధ్యక్షుడు శేర్ల రాజేశం, డైరెక్టర్లు పెరుమాండ్ల ఎల్లాగౌడ్, పెద్దపోచం, జాజాల లక్ష్మి, మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్, పీఏసీఎస్ సీఈవో రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

## యూనిఫాం సకాలంలో అందేలా చర్యలు

జగిత్యాల రూరల్, మే 31: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం సకాలంలో అందేలా చర్యలు చేపడుతున్నామని డీఆర్డీవో సంపత్ రావు తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్, పొలాస, పొరండ్ల గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులు కుడుతున్న దుస్తులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ, మహిళలకు ఇది మంచి అవకాశమని, దుస్తులు కుట్టేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డీపీఎంలు విజయభారతి, మల్లేశం, ఏపీఎం గంగాధర్, సీసీలు, వీవో అధ్యక్షులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సైకిళ్లు అందజేత

ఇబ్రహీంపట్నం, మే 31: మండల కేంద్రానికి చెందిన పిట్టల వంశీ తన పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం ఎర్దండి గ్రామంలోని ఒడ్డెరకాలనీలో నిరుపేద విద్యార్థులకు ఆరు సైకిళ్లను అందజేశారు. అనంతరం చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకలు జరుపుకొన్నాడు. కార్యక్రమంలో రెబ్బటి రాజేందర్, నాంపెల్లి రమేశ్, బొమ్మెన గణేశ్, నేమూరి గణేశ్, అంబాజి శ్రీకాంత్, అక్షయ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఐల ఆర్థిక సాయం

మేడిపల్లి, మే 31: దమ్మన్నపేట గ్రామానికి చెందిన నిమ్మ రాజశేఖర్ ఇటీవల సౌదీలో మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండగా, రాజశేఖర్ మిత్రులు శేరు కేశవ్, నిమ్మ నవీన్ ఎన్ఆర్ఐల ద్వారా రూ. 40 వేలు జమ చేసి పంపించారు. కాగా, బాధిత కుటుంబసభ్యులకు శుక్రవారం ఏనుగు మోహన్‌రెడ్డి, శేరు కృష్ణారెడ్డి నగదు అందజేశారు.

## ముగిసిన ఇంటర్ పరీక్షలు

జగిత్యాల టౌన్, మే 31: జిల్లాలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ముగిసినట్లు పరీక్షల కన్వీనర్ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం ప్రథమ సంవత్సరం విద్యార్థులు 2005 మందికి 1907 మంది, మధ్యాహ్నం 939 మందికి 877 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. అలాగే, గత మార్చిలో పరీక్షలకు హాజరు కాని విద్యార్థులకు జూన్ 4 నుంచి నిర్వహిస్తారని తెలిపారు.

## మామిడి తోటలో అగ్ని ప్రమాదం

జగిత్యాల రూరల్, మే 31: అంతర్గం గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌కు చెందిన మామిడి తోటలో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తోటలోని 6 మామిడి చెట్లు కాలిపోయాయి. ధర్మపురి ఫైర్ సిబ్బంది శకటంతో వచ్చి మంటలను ఆర్పారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 30,000 నష్టం జరిగినట్లు ఫైర్ అధికారులు తెలిపారు.

## ఆలయానికి విరాళం

పెగడపల్లి, మే 31: రాంబద్రునిపల్లి గ్రామంలో విజయగణపతి సాయిరామ ఆలయానికి నర్సింహునిపేటకు చెందిన రైతు సంఘం నాయకుడు సంది మల్లారెడ్డి శుక్రవారం రూ.10116 అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు రాజేశ్వర్‌రావు, లింగారెడ్డి, మాజీ ఎంపీటీసీ సత్తయ్య పాల్గొన్నారు.

## పదవి విరమణ పొందిన ఉద్యోగులకు సత్కారం


జగిత్యాల కలెక్టరేట్: ఏఎస్ఐని సన్మానిస్తున్న అడిషనల్ ఎస్పీ వినోద్‌కుమార్

జగిత్యాల కలెక్టరేట్, మే 31: ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ సత్యనారాయణ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఏఎస్ఐని అడిషనల్ ఎస్పీ వినోద్‌కుమార్, పోలీసు అధికారులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అడ్మిన్ రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్ జానీమియా, ఏఆర్ ఎస్ఐ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్, మే 31: మండలంలోని పెంబట్ల-కోనాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జానకీ ఉద్యోగ విరమణ పొందగా శుక్రవారం ఉపాధ్యాయులు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు జానకీ బడిబాట కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారంగాపూర్, మే 31: మండల కేంద్రంలోని సహకార సంఘ కార్యాలయంలో పనిచేస్తున్న సీఈవో ఎండీ ఇస్మాయిల్ ఉద్యోగ విరమణ పొందగా శుక్రవారం సంఘ కార్యాలయ ఆవరణలో సన్మాన కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు, సంఘ సభ్యులు, రైతులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘ చైర్మన్ ఏలేటి నర్సింహా రెడ్డి, ఉపాధ్యక్షుడు బాపిరాజు, సంఘ సభ్యులు, నాయకులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల అర్బన్, మే 31: ఉద్యోగ విరమణ అనంతరం విశ్రాంత జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని జగిత్యాల ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ అన్వేష్ సూచించారు. జగిత్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మి శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా లక్ష్మికి ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్, కార్యాలయ ఉద్యోగులు, పలువురు డాక్యుమెంట్ రైటర్లు ఆత్మీయ సత్కారం చేశారు. కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులు అభిలాష్, వెంకటేశ్, చేపూరి అనిల్, అరవింద్, డాక్యుమెంట్ రైటర్లు పాల్గొన్నారు.

## బైక్ మెకానిక్ షెడ్డులో అగ్నిప్రమాదం

జగిత్యాల కలెక్టరేట్, మే 31: జిల్లా కేంద్రంలోని ఓ మెకానిక్ షెడ్డులో అగ్నిప్రమాదం సంభవించడంతో 20 బైకులు దగ్ధమయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని రాజీవ్ బైపాస్‌లో అన్వేష్ అనే వ్యక్తి ద్విచక్రవాహనాలు రిపేర్ చేసుకుంటూ జీవిస్తున్నాడు. మూసి ఉన్న షెడ్డులో శుక్రవారం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి, మెకానిక్‌కు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన ఫైర్ సిబ్బంది మంటలార్పారు. షెడ్డులో ఉన్న సుమారు 20 బైకులు కాలిపోయాయి.

## పుంజాల లక్ష్మీబాయి మృతికి సంతాపం

జగిత్యాల టౌన్, మే 31: మాజీ గవర్నర్, కేంద్ర మంత్రి పీ శివశంకర్ సతీమణి లక్ష్మీబాయి మృతికి తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ సంతాపం తెలిపారు. పట్టణంలోని అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం లక్ష్మీబాయి చిత్రపటానికి సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్, వివిధ సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.